## (జిల్లా) పరీక్షిత్తు మహారాజు కథ

"రాత్రి తొమ్మిది దాటేక వస్తారు" అదీ జవాబు; నారాయణరాజు గారింటి దగ్గర.

అతనూ, నేనూ క్లాస్మేట్సుం. అనకాపల్లిలో అతను సర్వీస్ కమీషన్ పరీక్షరాసి గుమస్తా ఐ, పరమపదసోపాన పటం నిచ్చెనలన్నీ యెక్కి, జిల్లా పరిషత్ సెక్రటరీ అయ్యాడు.

మా మేనల్లుడు చిదంబరం ఆరేళ్ళ కిందట బి. ఏ. అర్హమైన ఉద్యోగానికీ అప్లికేషన్లు పెడతాడు. "నువ్వు పెట్టే అప్లికేషన్లతో పంపే పోస్టల్ ఆర్డర్ల డబ్బుతో వో కిళ్ళీకొట్టు పెట్టచ్చు" అని కూకలేసి, జంక్షన్లో బడ్డీ పెట్టించేను. మూలుగుతూ అయినా దాంట్లో కూచున్నాడు.

అసలు కుట్ర తరవాత తెలిసింది. కిళ్ళీకొట్లో వేలాడగట్టడానికి తెప్పించిన పత్రికలు (ఎక్కడకీ వెళ్ళక్కర్లేకుండా) అందుబాటులో వుంటాయి కదాని వాడు ఆ బడ్డీలో కుచున్నాడు. వాడికి వస్తుందనుకున్న ప్రతి వుద్యోగానికీ దరఖాస్తులు పెడుతూనే వున్నాడు.

"మొత్తం పదమూడు పోస్టులు మామయ్యా, అందులోనూ జిల్లా పరిషత్ సెక్రటరీ రాజుగారు నీ ఫ్రెండు కదా, అంచేత నాకీ మాటు ఉద్యోగం వచ్చి తీర్తుంది."

ఆ విధంగా నారాయణరాజుగారి దర్శనం కావలిసొచ్చింది నాకు.

పన్నెండున్నర కొచ్చాడు రాజు.

"తొమ్మిది దాటాక వస్తానన్నారు, కూచున్నాం" అన్నాను.

రాజు వాచీవేపు చూసి "తొమ్మిది దాటిందిగా" అని నవ్వాడు.

సంగతంతా చెప్పి "రేపు వీడికి ఇంటర్‌వ్యూ. వీడి పేరు గుర్తుంటుందిగా, చిదంబరం" అన్నాను.

"చిదంబరమో, కుంభకోణమో - ఏదైనా ఫరవాలేదు. ఇదుగో ఈ కార్డు నీ దగ్గరుంచు. నేనెంత పన్లోవున్నా నువ్వు నా రూంలోకి రావడానికి ఈ కార్డు సహకరిస్తుంది. సాయంకాలం ఆరింటికి రా."

* * *

సాయంకాలం ఆరవుతూ వుండగా (జిల్లా) పరీక్షిత్తు మహారాజు గారి తోటలోకి వెళ్ళాను.

అక్కడ దాదాపు వెయ్యిమంది వున్నారు. వాళ్ళలో ఇంటర్‌వ్యూ కొచ్చినవాళ్ళు (మొగా, ఆడా) వాళ్ళతో బాటొచ్చిన తండ్రులు, అన్నలూ, మొగుళ్ళూ ఎంత కోలాహలంగా వుందో అంత నిరుత్సాహంగానూ వుంది. వాతావరణం ఉదయం ఎనిమిది గంటలనించీ జీవితంలో నీడకోసం ఆశించి చెట్టునీడకోసం వెతుక్కుంటూ రెండిటికి పోటీలుపడుతూ నిలబడే వున్నారుట అందరూనూ. ఇలా మూడు రోజులనుంచి జరుగుతోంది, ఇంకో రెండు రోజులు జరగొచ్చు.

"నా నెంబరు 3894 ఇప్పుడు. 3875 వరకు వచ్చింది, దీం తరువాత బ్యాచ్‌లోనే వెళ్ళాలి" అన్నాడు మా చిదంబరం.

"బ్యాచేమిటి? ఒక్కొక్కళ్ళనీ పిలవడం లేదా, ఇంటర్‌వ్యూకి?"

"అదే తేలీడంలేదు. పాతికేసి మంది వెళ్తున్నారు, సరిగా అయిదు నిమిషాల్లో వెనక్కొచ్చేస్తున్నారు?"

రాజు ఇచ్చిన కార్డు సాయంతో లోపలి కెళ్ళాను- అతను మరో ఇద్దరు అధికారులు కుర్చీల్లో కూచున్నారు.ఎదుట బెంచీలమీద క్లాస్‌రూమ్ పద్ధతిలో 25 మంది కుర్రాళ్లు బిక్క మొహాలేసుకుని కూచున్నారు.

"ఆలోచించండి. సమాధానం ఎవరు చెప్పినా అందర్నీ పాస్ చేస్తాను" అని నారాయణరాజు నన్ను తన పక్క కుర్చీలోకి పిలిచేడు.

"తరువాత ప్రశ్న. ఇదే ఆఖరు ప్రశ్న కూడాను. దీంతో మీ భవిష్యత్తు నిర్ణయమై పోతుంది.... అలాస్కాలో ముఖ్యమైన పంట ఏది ?— సరైన సమాధానం చెప్పగలమని అనుకుంటున్న వారు చేతు లెత్తాలి. అలా చేతులెత్తిన వారు ఒకరికంటె ఎక్కువ వుంటే శ్లిప్పుల మీద మీ ఆన్సర్లు, నెంబర్లు వెయ్యాలి- గుర్తుంచుకోండి! ఎవరు తప్పు వ్రాసినా అందరూ డిస్‌క్వాలిఫై అయిపోతారు. అలా కాకుండా ఒక్కరే రాసి, అది సరైన సమాధానం అయితే అందర్నీ పాస్ చేస్తాను !"

ఒక్క చెయ్యీ లేవలేదు.

ఒక నిమిషం చూసి రాజు బెల్ నొక్కాడు. వరండాలో అయిన చప్పుడు విని మొహానికి పేపరు అడ్డం పెట్టుకున్నాడు. ఒక ప్యూను వొచ్చి కుర్రాళ్ళనందర్నీ లేవగొట్టి తోలుకుపోయాడు.

"ఈ రకం ఇంటర్‌వ్యూ ఎన్నడూ కనీ వినీ ఎరగం" అన్నాను.

"మరేం చెయ్యను ? పదమూడు ఎల్. డి. సి. ఖాళీలకి 50985 అప్లికేషన్లు వొచ్చాయి. ఒక్కొక్కణ్ణీ విడివిడిగా ఇంటర్వ్యూ చేస్తే ఏడాదిపాటు నేనూ ఈ ఇద్దరూ కూడా ఆ పని మీదనే వుండాలి."

మరో పాతికమంది కుర్రాళ్ళు నిశ్శబ్దంగా లోపలికొచ్చారు. అధికార్లు ముగ్గురితోబాటు నాకూ నమస్కారాలు పెట్టి బెంచీలమీద కూచున్నారు.

ఇంటర్వ్యూకి పద్ధతి వివరించి చెప్పి, "జాన్ ఎఫ్. కెనెడీ అమెరికాకి ప్రెసిడెంటు కాకపూర్వం ఏం చేసేవాడు ?"

అలాగే మరి రెండు ప్రశ్నల్తో ఆ బ్యాచిని వదలగొట్టేశాడు.

ఈ లోపుగా నేను లెక్క వేశాను. 5985 మంది 5 రూపాయల చొప్పున అప్లికేషన్ ఫీజు చెల్లించేరు. దాదాపు ముప్ఫయివేలు ఆదాయం.

అభ్యర్థులు అప్లికేషన్లు రిజిస్టర్ చెయ్యడానికి, పాస్‌పోర్టు ఫొటోలు తీయించుకోడానికి, సర్టిఫికెట్లు గెజిటెడాఫీసర్ల చేత అటెస్టు చేయించుకోడానికి, ఇంటర్వ్యూకి ఈ వూరు రావడానికి, వుండడానికి, తినడానికి ఒక్కొక్కరు 30 రూపాయలు ఖర్చు పెట్టుంటారు. వెరశి అది లక్ష ఎనభై వేలు.

"ఎవరూ సమాధానాలు చెప్పలేకపోతే ఉద్యోగా లెవరి కిస్తావు?" అన్నాను.

"పదమూడు ఖాళీలు. పదింట్లో, మా ఆఫీసులో టెంపరరీ గుమాస్తాలు కన్‌పర్మవుతారు. మిగతా మూడింట్లో ఒకటి మా ఛేర్మన్ గారి మేనకోడలు కూతురికి, రెండోది మరొకరికి, మూడోది ఇంకొకరికి___ అలా అని ముందే నిర్ణయమైపోయింది."

"అయితే ఈ సర్పయాగం అంతా ఎందుకు ?"

"తప్పదు. అప్లికేషన్ పెట్టిన ప్రతివాణ్ణీ ఇంటర్వ్యూకి పిలవాలి."

"ప్రభుత్వశాఖ కదా, ఇంత అన్యాయం తగునా !"

నారాయణరాజు మాట్లాడలేదు. తరవాత బ్యాచ్‌ని హడలగొట్టే ప్రశ్నలకోసం చూసుకుంటున్నాడు.

(13-5-78)